క్లుప్తంగా

పేర్నాటిని గెలిపించండి



కోటలో శ్యాంప్రసాద్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కోట: తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు కోటలో ప్రచారం చేశారు. కోట, శ్యాంసుందరపురంలో పట్టభద్రుల ఓటర్లను కలుసుకుని కరపత్రాలను అందజేసి మీ మొదటి ప్రాధాన్యత ఓటును వేసి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మొబీన్‌బాషా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు ఉప్పల ప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

కిచెన్ గార్డెన్ తనిఖీ



చందనముడి పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షిస్తున్న ఎంఈఓ

దొరవారిసత్రం: చందనముడి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు సాగు చేసిన కిచెన్‌గార్డెన్‌లోని గోంగూర, పలు రకాల కూరగాయల చెట్లను స్థానిక ఎంఈఓ మస్తానయ్య సోమవారం సందర్శించారు. అలాగే పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. జగనన్న గోరుముద్ద నిర్వహణ, రికార్డుల నిర్వహణను పరిశీలించారు.

రైల్లోంచి పడి.. వ్యక్తికి తీవ్రగాయాలు

గూడూరు: రైల్లోంచి ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడిన సంఘటన గూడూరు–ఓడూరు రైల్వేస్టేషన్‌ల మధ్య సోమవారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్‌ఐ కొండపనాయుడు కథనం మేరకు.. సూళ్లూరుపేట పట్టణానికి చెందిన సలీం అనే వ్యక్తి చికెన్ స్టాల్‌లో పనిచేస్తున్నాడు. అతను గూడూరులోని బంధువుల ఇంటికి వచ్చి, తిరిగి మెమో రైల్లో సూళ్లూరుపేటకు వెళుతూ ఓడూరు సమీపంలో రైల్లోంచి జారిపడిపోయాడు. ఈ ఘటనలో గాయపడిన క్షతగాత్రుడిని 108లో గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోడిపందెం రాయుళ్లకు జరిమానా

దొరవారిసత్రం: పోలీసు దాడుల్లో పట్టుపడిన ముగ్గురు కోడి పందెం రాయుళ్లకు జరిమానా విధిస్తూ సూళ్లూరుపేట కోర్టు జడ్జి అనిల్‌కుమార్ సోమవారం తీర్పు చెప్పారు. వెదరుపట్టు గ్రామ పరిసర ప్రాంతంలో ఆదివారం రాత్రి కోడి పందెలు ఆడుతున్న ముగ్గురు పందెం రాయుళ్ల పోలీసులు అరెస్టు చేసి కోడి పుంజు, రూ.వెయ్యి నగదు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. పోలీసులకు పట్టుబడిన ముగ్గురిని సోమవారం సూళ్లూరుపేట కోర్టులో హాజరుపరచగా ఒక్కొక్కరికి రూ.50 వంతున జరిమానా విధిస్తూ జడ్జి అనిల్‌కుమార్ తీర్పు చెప్పారు. మరోసారి పట్టుపడితే జైలు శిక్షణ తప్పదని హెచ్చరించారు.

నియామకపత్రం అందజేత



నియామక పత్రం అందజేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ

దక్కిలి: మండలంలోని చాపలపల్లెలో నూతనంగా ఎంపికైన వలంటీర్‌కు సోమవారం ఎంపీపీ గోను రాజశేఖర్, ఎంపీడీఓ కోటేశ్వరరావు నియామక పత్రం అందజేశారు. ఎంపీపీ మాట్లాడుతూ ఇటీవల నలుగురు వలంటీర్లను అధికారులు ఎంపిక చేశారన్నారు. వీరంతా బాధ్యతగా పని చేయాలన్నారు. నవరత్నాల సంక్షేమ పథకాలను ఆయా వలంటీర్‌లకు అప్పగించిన 50 కుటుంబాలకు అందేలా చూడాలన్నారు. మెరుగైన సేవలను అందించి మంచి పేరు పొందాలన్నారు.

వ్యర్థాల తొలగింపు



వ్యర్థాలను తొలగిస్తున్న మున్సిపల్ కార్మికులు

నాయుడుపేటటౌన్: నాయుడుపేట స్వర్ణముఖి నది నుంచి విన్నమాల చెరువు వరకు ఉన్న విన్నమాల సప్లయ్ చానల్(కాలువ)లో పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులు సోమవారం తొలగించారు. పట్టణంలో ఉన్న ఈ కాలువలో పెద్దఎత్తున మురుగు నీరు నిల్వలు చేరి ఉండడం, దీంతో కాలువలో దోమల వృద్ధి చెందడంతో విన్నమాల సప్లయ్ చానల్‌లో నీరు ప్రవహించేలా చర్యలు చేపట్టారు. ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

యోగీశ్వరులు కొలువుదీరిన క్షేత్రం..

సిద్ధలయ్య కోన

పచ్చని ప్రకృతి.. మనసు దోచే రమ్యమైన దొరువులు.. కనువిందుచేసే ఏతైనా కొండలు.. ఇక్కడ ప్రతిచెట్టూ పుట్టా, కొండా కోన అన్నీ స్వామి స్వరూపాలే. నిరంతరం ప్రాపంచిక జీవనయానంలో అలసిన మానవాళి సర్వమతసమ్మేళనంగా ఇక్కడకు విచ్చేసి ప్రకృతి సిద్ధమైన వాతావరణంలో సేదతీరుతారు. జీవవైవిద్యానికి నెలవై, యోగీశ్వర్లు కొలువుదీరిన అద్భుత క్షేత్రమే సిద్ధలయ్య కోన. మహాశివరాత్రి పురస్కరించుకుని కోనలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. –సైదాపురం



సిద్ధలయ్య కోనలోని శివపార్వతుల విగ్రహాలు



సిద్ధలయ్య ఆలయానికి వెళ్లే మార్గం

మండల కేంద్రమైన సైదాపురం గ్రామానికి 3 కిలోమీటర్లు దూరంలో వాయువ్య దిశలో మానవ సంచారానికి దూరంగా ప్రకృతి సిద్ధమైన వాతావరణంలో సిద్ధలయ్యకోన ఉంది. దైవాంశ సంభూతులైన ఇద్దరు యోగీశ్వర్లు శ్రీనవకోటి సిద్ధలయ్య, నవనాథ సిద్ధలయ్యతోపాటు వారి ప్రియశిష్యుడైన సారంగధరుడు స్వయంభువులుగా వెలసి ఉన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం జరిగే శివరాత్రి వేడుకల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు మునేశ్వర్లు చెప్పారు.

సిద్ధలయ్యకోనకు చేరుకోవాలిలా..

నెల్లూరు నుంచి గూడూరు మీదుగా 53 కిలో మీటర్ల దూరంలో ఉన్న సైదాపురం గ్రామానికి చేరుకోవచ్చు. అలాగే నెల్లూరు నుంచి పొదలకూరు మీదుగా 52 కిలోమీటర్ల దూరంలో ఉన్న సైదాపురం చేరుకోవచ్చు.అక్కడ నుంచి భక్తులు ఆటోల్లో 5 కిలో మీటర్ల దూరంలో ఉన్న కోన వద్దకు చేరుకోవచ్చు.అలాగే కడప నుంచి రాపూరుకు చేరుకుని అక్కడ నుంచి 23 కిలోమీటర్ల దూరంలో ఉన్న సైదాపురం చేరుకుంటే అక్కడి నుంచి సులభంగా కోన వద్దకు ఆటోలు, కార్లలో చేరుకోవచ్చు. పొదలకూరు, గూడూరు, రాపూరు మీదుగా సైదాపురం గ్రామానికి ప్రతి అరగంటకు బస్సు సౌకర్యం ఉంది.



సిద్ధలయ్య కోనలోని శివలింగం

సైదాపురం ఎంపీడీఓగా వెంకటేశ్వర్లు

సైదాపురం: స్థానిక ఎంపీడీఓగా వెంకటేశ్వర్లు సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన డ్వామాలో విధులను నిర్వర్తిస్తుండేవారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆయన సైదాపురం ఎంపీడీఓగా బదిలీపై వచ్చారు.

రాపూరు ఎంపీడీఓగా వీర్రాజులు

రాపూరు: స్థానిక ఇన్‌చార్జి ఎంపీడీఓగా వీర్రాజులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న అమోస్‌బాబు సెలవుపై వెళ్లడంతో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్‌డీగా పనిచేస్తున్న వీర్రాజులను ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమిస్తూ జిల్లా అధికారులు ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఎంపీడీఓగా కరిముల్లా

వెంకటగిరిరూరల్: స్థానిక ఎంపీడీఓగా కరిముల్లా సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న కోటేశ్వరావు బదిలీపై డక్కిలికి వెళ్లగా డక్కిలి ఎంపీడీఓగా ఉన్న కరిముల్లా వెంకటగిరికి వచ్చారు.

బాలాయపల్లి ఎంపీడీఓగా స్వరూపారాణి

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): స్థానిక ఎంపీడీఓగా స్వరూపరాణి సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతకొంతకాలంగా ఏఓగా ఉన్న డీజే వినీల్‌కుమార్ ఇన్‌చార్జి ఎంపీడీఓ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కోట మండలం ఈఓపీఆర్డీగా ఉన్న స్వరూపరాణి బదిలీపై బాలాయపల్లి ఎంపీడీఓ వచ్చారు. ఈ నేపథ్యంలో ఆమె బాధ్యతలు స్వీకరించడంతో వినీల్‌కుమార్ ఏఓగా కొనసాగనున్నారు.

లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి

చిల్లకూరు: పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులకు ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది సమష్టిగా అవగాహన కల్పించి పనులు ముమ్మరం చేసేలా చూడాలని ఏఈ అహ్మద్‌బాషా తెలిపారు. లింగరం సచివాలయంలో సోమవారం పక్కా గృహాల లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం లబ్ధిదారులకు, ఇసుక, సిమెంట్ కమ్మీ ఉచితంగా అందిస్తుందని తెలిపారు. అలాగే లబ్ధిదారులు పొదుపు గ్రూపుల్లో సభ్యులుగా ఉంటే నిర్మాణా పనులకు రూ.30 వేల వరకు రుణాలను అందించేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని లబ్ధిదారులు ఉగాది నాటికి నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయాలని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో సర్పంచ్ నాశిన సుబ్రహ్మణ్యం, కార్యదర్శి మాధవి తదితరులు పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్ల పంపిణీ

నాయుడుపేటటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉంటున్న పేదలకు సోమవారం తడకండ్రిగకు చెందిన శ్రీకృష్ణ ఫౌండేషన్ సభ్యుల ఆధ్వర్యంలో ఆహార ప్యాకెట్లను పంపిణీ చేశారు. పట్టణంలోని పలు ఆలయాల ఎదుట, రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఉండే నిరాశ్రయులు, వృద్ధులకు ఫౌండేషన్ సభ్యులు నెల్లూరు నాగరాజు సభ్యులతో కలసి భోజన ప్యాకెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు చిట్టిబోయిన ప్రసాద్, అమ్ములు మునెమ్మ పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న లారీ



గాయపడిన కూలీ పోలయ్య

కోట: కూలీలతో వెళుతున్న ట్రాక్టర్‌ను ధాన్యం లోడ్ ఎదురుగా వస్తున్న లారీ ఢీకొన్న సంఘటన సోమవారం మండలంలోని కొక్కుపాడు రోడ్డు వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. కోటకు చెందిన కూలీలు ఎనిమిది మంది ట్రాక్టర్‌లో ఇటుకబట్టీల వద్దకు పనికి వెళుతుండగా కొక్కుపాడురోడ్డు వద్ద ధాన్యంలోడుతో ఎదురుగా వచ్చిన లారీ ఢీకొంది. ప్రమాదంలో ట్రాక్టర్ పక్కకు ఒరిగి పొలాల్లో పడిపోగా ముగ్గురు గాయపడ్డారు. గాయపడిన సుబ్బయ్య, సింహాద్రి, పోలయ్యను కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ పుల్లారావు సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదంపై వివరాలు సేకరించారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్



కలువాయి: మండలం తెలుగురాయపురం సమీపంలో పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను సోమవారం సెబ్ అధికారులు సీజ్ చేశారు. ఆత్మకూరు సెబ్ సీఐ నయనతార తన సిబ్బందితో కలిసి నూకనపల్లె సమీపంలో దాడులు చేసి, ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్ల సీజ్ చేసి, డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సీజ్ చేసిన ట్రాక్టర్లను కలువాయి స్టేషన్‌లో అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు కలువాయి ఎస్‌ఐ మహేంద్ర తెలిపారు.

కండలేరులో 47.214 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 47.214 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,210 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 30, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 60, లోలెవల్ స్లూయిస్‌కు70, హైలెవల్ స్లూయిస్‌కు 180 క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

ముక్కంటికి పట్టువస్త్రాల సమర్పణ

శ్రీకాళహస్తి : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీకాళహస్తీశునికి సోమవారం తమిళనాడు వాసి ఎస్.నాగరాజు 16 పట్టు చీరలు, 20 పట్టు పంచెలు సమర్పించారు. అలాగే నాయుడుపేట వాసి, సాగర్ సిమెంట్ అధినేత కె.సుబ్రమణ్యం, సురేష్, రమేష్ 300 టీషర్టులను శ్రీకాళహస్తీశ్వర దేవస్థానం పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్ బాబుకు అందజేశారు. దాతలకు ప్రత్యేక దర్శనం అనంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద చైర్మన్ శేషవస్త్రాలతో సత్కరించారు. వేద పండితులు ఆశీర్వచనం పలికి, స్వామి అమ్మవార్ల చిత్రపటం, తీర్థప్రసాదాలను అందచేశారు. కార్యక్రమంలో ఈఈ మురళీధర్ రెడ్డి, బోర్డు సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.



టీషర్టులు అందజేస్తున్న నాయుడుపేట వాసులు

తెగుళ్లపై అప్రమత్తత అవసరం



వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ

దక్కిలి: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో అగ్గి తెగులు, మెడవిరుపు తెగులు ఎక్కువగా ఆశించి ఉన్నాయని, రైతులు వీటిపై అప్రమత్తంగా వ్యవహరించి, సస్య రక్షణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని వెంకటగిరి ఏడీఏ నాగార్జునసాగర్ తెలిపారు. మండలంలోని చాపలపల్లె, నాగవోలు గ్రామాల్లో ఎంపీపీ గోను రాజశేఖర్, ఏఓ విజయభారతి, వ్యవసాయశాఖ సిబ్బందితో కలిసి పలువురు రైతులు సాగు చేసిన వరి పంట సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా ఆర్‌ఎన్‌ఆర్ 15048 (షుగర్‌లెస్)రకంలో ముదురు పైరులో (వెన్నుదశలో) వెన్ను కింద భాగంలో మచ్చపడడంతో వెన్ను పూర్తిగా ఎండిపోతుందన్నారు. మెడ విరుపు తెగులును గమనించిన వెంటనే రైతులు ఎకరాకి 350 మిల్లీలు ఐసోప్రోథియోలిన్ లేదా కాసుగామైసిన్ 500 మిల్లీలు పిచికారి చేసుకోవాలని సూచించారు.అలాగే లేత పైరుకు అగ్గి తెగులు ఆశిస్తుందని, దీని నివారణకు ట్రైసైక్లోజోల్ అనే రకం మందును ఎకరాకి 120 గ్రాములు పిచికారి చేసుకోవాలని సూచించారు.

మా పేరుతో రుణాలు తీసుకుని పరారైంది!



నిరసన వ్యక్తం చేస్తున్న పొదుపు మహిళలు

గూడూరు: వీఓఏ (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్) తమ వద్ద సంతకాలు తీసుకుని, తమకు తెలియకుండానే భారీ మొత్తం బ్యాంకులో రుణం తీసుకుని ఆ సొమ్ముతో పరారైందని పొదుపు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. రుణ బకాయిలు చెల్లించాలని తమపై బ్యాంకు అధికారుల ఒత్తిళ్లు ఎక్కువయ్యాయని, తమకు న్యాయం చేయాలంటూ చెన్నూరులోని పొదుపు మహిళలు ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఏఓకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ చెన్నూరు గ్రామానికి చెందిన ఆరో సంఘంలో తాము సభ్యులమన్నారు. తమ వీఓఏ అయిన చల్లా శ్రీలక్ష్మి మీకు రుణం ఇప్పిస్తాను సంతకాలు చేయండని చెప్పిందన్నారు. ఐదు గ్రూపులకు చెందిన వారు సంతకాలు చేయగా, బ్యాంకులో వీఓఏ రూ.40 లక్షలు రుణం తీసుకుందన్నారు. తమకు కేవలం రూ.7.20 లక్షలు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. ఈ విషయం తెలుసుకుని, శ్రీ లక్ష్మిని నిలదీయడంతో పరారైందన్నారు. ఈ విషయమై ఏపీఎంకు వినతి పత్రం అందజేసినా ఆమె కూడా పట్టించుకోలేదన్నారు. దీంతో రుణం చెల్లించాలంటూ బ్యాంకు అధికారుల నుంచి వస్తున్న ఒతిళ్లు తట్టుకోలేక, శ్రీలక్ష్మి భర్త మురళిని తీసుకొచ్చి రూరల్ పోలీసులకు అప్పగించామన్నారు. వారు కూడా ఎలాంటి చర్యలు తీసుకోకుండా అతన్ని వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో ఉన్న శ్రీవల్లి దేవసేన సమేత షణ్ముగ సుబ్రహ్మణ్యేశ్వ స్వామి ఆలయంలో సోమవారం కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు అభిషేక పూజలను నిర్వహించారు. అనంతరం వేదపండితులు ఆధ్వర్యంలో కాలభైరవ స్వామికి హోమ పూజలు జరిపారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చదలవాడ మోహన్‌కృష్ణ శర్మ, ఉదయ కర్తలు, సుబ్రహ్మణ్యేశ్వర పీఠం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



ఆలయంలో హోమ పూజలు చేస్తున్న వేదపండితులు



ప్రకృతి హృదయం

ప్రకృతిలో పలు చిత్రాలు కనిపిస్తూ ఉంటాయి. వీటిని ఆ దృష్టితో చూసినప్పుడే కొన్ని కనువిందు చేస్తాయి. నేడు ప్రేమికుల రోజు కావడం, తీర ప్రాంతంలోని బల్లవోలు గ్రామ పొలాల్లో ఇలా రెండు చెట్ల మధ్యలో హృదయం ఆకారంలో ఇలా ప్రకృతి కనిపించడం యాదృచ్ఛికమే అయినా ఇలా పచ్చని పంట చేల మధ్య హృదయాకారంలో ఉన్న చెట్లు కనువిందు చేయడాన్ని సోమవారం సాక్షి క్లిక్ మనిపించింది. - చిల్లకూరు

లక్ష్మీనరసింహుడి సేవలో ఈజేసీ

రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆది లక్ష్మీదేవి, ఆంజనేయస్వామిని సోమవారం దేవాదాయ జాయింట్ కమిషనర్ (ఈజేసీ) చంద్రశేఖర్ ఆజాద్ దర్శించుకున్నారు. ఆయనకు ఏసీ జనార్దన్‌రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. వేదపండితులతో ఆశ్వీరచనాలు పలికారు. తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి ఆయన అడిగి తెలుసుకున్నారు.ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ రాణాప్రతాప్ ప్రధాన అర్చకులు సీతారామయ్యస్వామి ఉన్నారు.



స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకులు

పాఠశాలల అభివృద్ధికి సహకారం

పెళ్లకూరు: పునబాక పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకారం అందిస్తామని గ్రీన్ ప్యానెల్ ప్లైవుడ్ కంపెనీ ఎండీ సుభాష్‌కుమార్ అగర్వాల్ పేర్కొన్నారు. సోమవారం పునబాక, పునబాక తూర్పుకండ్రిగ, పునబాక చెరువుతట్టుకండ్రిగ, ఆర్లపాడు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. మొత్తం నాలుగు పాఠశాలల్లో విద్యార్థులు కూర్చొవడానికి బల్లలు, ఆర్వోప్లాంట్లు, విద్యార్థులకు బ్యాగ్‌లు, నోటు పుస్తకాలు తదితర విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తమ వంతు సహకరిస్తామన్నారు. పునబాక కండ్రిగలోని పాఠశాలకు ప్రహరీగోడ నిర్మాణం, చెంబేడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు చదువుకోవడానికి రేకుల షెడ్ నిర్మాణానికి తమవంతు ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సుబ్రమణ్యం, కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్లు కలైరసన్, బాలాజీ, హెచ్‌ఎంలు సుప్రియ, కృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నాయకుడు మల్లిరెడ్డి పాల్గొన్నారు.



పునబాకలో విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న సుభాష్‌కుమార్ అగర్వాల్

బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

వెంకటగిరిరూరల్: ఇద్దరు వ్యక్తులు ద్విచక్రవాహనంపై వెళుతుండగా రోడ్డుకు అడ్డంగా అడవి పంది రావడంతో దాన్ని ఢీనికి మోటారుసైకిల్ అదుపు తప్పి ఇద్దరు తీవ్ర గాయపడ్డారు. ఈ ఘటన వెంకటగిరి–గూడూరు మార్గంలోని కలపాడు వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. క్షతగాత్రుల కథనం మేరకు.. బాలాయపల్లి మండలం యాచవరం గ్రామానికి చెందిన కె జనార్దన్, లక్ష్మీకాంతమ్మ తమ ద్విచక్రవాహనంపై వ్యక్తిగత పనులను నిమిత్తం వెంకటగిరికి వచ్చి తిరిగి స్వగ్రామమైన యాచవరం గ్రామానికి బయలు దేరారు. ఈ క్రమంలో కలపాడు వ్యవసాయ పొలాల వద్దకు వచ్చేసరికే అడవి పంది మోటారుసైకిల్‌కు అడ్డంగా రావడంతో ఢీకొన్నట్లు తెలిపారు. ఈ ఘటనలో జనార్దన్‌కు కాలు విరగగా, లక్ష్మీకాంతమ్మకు స్వల్పగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి సిఫార్సు చేశారు.



చికిత్స పొందుతున్న క్షతగాత్రుడు జనార్దన్

మచ్చలుంటే పరీక్షలు చేసుకోండి

రాపూరు: వంటి మీద ఎటువంటి మచ్చలున్నా వెంటనే పరీక్షలు చేయించుకోవాలని అడిషినల్ డీఎంహెచ్‌ఓ వెంకటప్రసాద్ సూచించారు. రాపూరు మండలం రావిగుంట పల్లె సమీపంలోని లెప్రసీ కాలనీలోని కుష్టువ్యాధిగ్రస్తులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో లెప్రసీపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించామన్నారు. వంటిపై రాగివర్ణం కలిగి, స్పర్శ లేని మచ్చలున్న వారిని గుర్తించామన్నారు. కొత్తగా 75 లెప్రసీ వ్యాధిగ్రస్తులను గుర్తించినట్లు చెప్పారు. వీరందరికి మందులు అందజేసినట్లు తెలిపారు. ఎవరికైనా వంటిపై మచ్చలుంటే స్థానిక వైద్యశాల్లో పరీక్షలు చేయించుకోవాని సూచించారు. అనంతరం వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం సూపర్ వైజర్ లింగమూర్తి అందించిన టబ్‌లను కుష్టువ్యాధిగ్రస్తులకు ఆయన పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో వేపినాపి వైద్యులు ధర్మేంద్ర, వైద్యసిబ్బంది కాంతమ్మ, నరసింహులు, వరదయ్య, ప్రసాద్, సిస్టర్ సెలీనాకుమారి పాల్గొన్నారు.



టబ్‌లు పంపిణీ చేస్తున్న వెంకటప్రసాద్

కర్మ విధానాన్ని గ్రహించాలి

గూడూరు: భగవంతుని పూజించడంతోపాటు, భగవద్గీత సారాంశాన్ని తెలుసుకుని కర్మ విధానాన్ని గ్రహించాలని త్రైతసిద్ధాంత, ఇందూ జ్ఞానవేదిక, ప్రబోధసేవా సమితి సభ్యులు పేర్కొన్నారు. మేగనూరు, అయ్యవారిపాళెం గ్రామాలతోపాటు ఓజిలి మండలం భువనగిరిపాళెం గ్రామాల్లో సోమవారం ఆధ్యాత్మిక గ్రంథాల ఇందూ ధర్మ ప్రచారం, గ్రంథ పరిచయం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేవుని పూజించడమే కాకుండా, ఆయన అందించిన భగవద్గీత ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకుని, కర్మ సిద్ధాంతాన్ని తెలుసుకుని మోక్షం పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏ మహేశ్వర్, రాధిక, రామకృష్ణ, కరుణాకర్, కుమార్, గుణసుందరి, మమత, జ్యోతి, ఏకాంబరం, శ్రావణి, శైలజ తదితరులు పాల్గొన్నారు.



గ్రంథ ప్రచారం చేస్తున్న ఆధ్యాత్మిక సంఘాల సభ్యులు

రైల్వే గేటు మూసివేత..

వాహనచోదకులకు ఇక్కట్లు

గూడూరు: చెన్నై రైలు మార్గంలోని గూడూరు పట్టణంలో ఉన్న రైల్వే గేటును మరమ్మతుల కారణంగా సోమవారం నుంచి మూసివేశారు. దీంతో ఆ మార్గంలో వెళ్లే వాహన చోదకులకు ఇక్కట్లు తప్పలేదు. ఒకటి, రెండో పట్టణాలకు మధ్య గూడూరు– చెన్నై, గూడూరు–తిరుపతి రైలు మార్గాల్లో రైల్వేగేట్లు ఉన్నాయి. ఈ క్రమంలో చెన్నై రైల్వే గేటును మరమ్మతుల కారణంగా ఈ నెల 12 నుంచి 26వ తేదీ వరకు మూసేశారు. దీంతో ఆ మార్గం మీదుగా రాకపోకలు నిలిచి పోయాయి. ఆ మార్గం మీదుగా రూరల్ పరిధిలోని పాలిచర్ల, కొండాగుంట, వెందోడు, కాంద్ర తదితర గ్రామాల ప్రజలతోపాటు, రెండో పట్టణంలోని పలు ప్రాంతాలకు వెళ్లే వారికి తీవ్ర ఇబ్బందులు తప్పలేదు. ఈ క్రమంలో ప్రత్యామ్నాయంగా అండర్ బ్రిడ్జి నుంచి వెళ్లాలంటే అక్కడ ఎప్పుడు, ఎంత సేపు ట్రాఫిక్ స్తంభిస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఆ మార్గంలో ట్రాఫిక్ స్తంభించకుండా, రెండు వైపులా పోలీసులను ఏర్పాటు చేస్తే తప్ప, తమకు కష్టాలు తీరవని వాహన చోదకులు వాపోతున్నారు. పోలీసులు ఆ దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.



మూత పడిన రైల్వేగేటు